

పోలీసులను సత్కరిస్తున్న మంథన్ స్కూల్ విద్యార్థులు

## పోలీసులను సత్కరించిన విద్యార్థులు

**రామచంద్రాపురం, అక్టోబరు 22 ప్రభాతార్త :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని కొల్లూరు పోలీసు ఠాణాలో, రామచంద్రాపురం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీసులను హైద్రాబాద్‌లోని మంథన్ స్కూల్ విద్యార్థులు సందర్శించి పోలీసులను శాలువాలతో సత్కరించారు. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలకు చెందిన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు పోలీసు సేవలను గౌరవిస్తూ వారు తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు, బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కొల్లూరు పోలీసు ఠాణా ఎస్‌హెచ్ఓ ఏ రవీందర్, సబ్ ఇన్స్‌పెక్టర్ సురేష్, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో రైతులు సాగు చేసుకున్న వరి పంటను కొనుగోలు చేసేందుకు వెంటనే వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ మంత్రి, శాసనసభ్యులు శంకరంపేట్(ఎ) కమలాపూర్‌లో ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు ఒక క్వింటాలు వరిని కూడా కొనుగోలు చేయలేదన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతి పంటకు రూ. 500 బోనస్ చెల్లించాల్సి ఉండగా కాంగ్రెస్ నేతలు బోనస్‌ను కాస్తా బోగస్‌గా చూపిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి రాగానే రైతులు పండించిన పంటలు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో కందులు సోయాబీన్, పెసర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఒక గింజ కూడా కొనుగోలు చేయకపోవడంపై మండిపడ్డారు. రైతులకు రైతు బంధు ఇవ్వకుండా రైతులను దగా చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, సర్పంచ్ ఫోరం మాజీ మండల అధ్యక్షులు జగదీశ్వర్ చారి, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, మాజీ సర్పంచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే తప్పుడు ఆరోపణలు

**టిపిసిసి అధికార ప్రతినిధి పల్లె రామచంద్రంగౌడ్**



మాట్లాడుతున్న పల్లె రామచంద్రగౌడ్

**రామాయంపేట, అక్టోబరు 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో టీఆర్ఎస్, బిజెపిలు ఉనికి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్ విమర్శించారు. ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు నిరసనలు తెలపడానికి ఎలాంటి నైతిక హక్కు లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు చేయని అభివృద్ధిపనులు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేసి చూపిస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ రైతుల పక్షపాతి అన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 22 వేల కోట్ల రుణమాఫీ అమలుచేయడం జరిగిందన్నారు. మిగిలిన 9 వేల కోట్ల రూపాయలు అడ్వాన్స్‌గానే రైతుల కోసం ఉన్నాయన్నారు. గత ఎన్నికల్లోనే బీఆర్ఎస్, బిజెపిలు కలిసి పనిచేసినా కాంగ్రెస్ పార్టీని ఏం చేయలేదని, భవిష్యత్తు అంతా కాంగ్రెస్‌దే అన్నారు. అదేవిధంగా నిరుద్యోగులకు 50 వేల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. అలాగే రామాయంపేటలో ఆర్టీసీ బస్టాండ్‌కు 20 సంవత్సరాల క్రితమే భూమి పూజ చేయడం జరిగిందన్నారు. శాటిలైట్ ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సేవల అధ్యక్షుడు జహీరుద్దీన్, కోనాపూర్ సొసైటీ డైరెక్టర్ మామిడి సిద్ధరాములు, ఓబిసి సెల్ జిల్లా కన్వీనర్ విప్లవకుమార్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ భైరం శంకర్, ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ బొట్ల బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భైరం కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిక్షపతి, పుట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాలు తెరిపించండి..వ్యాపారాలు చేసుకుంటారు

**జహీరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పట్టణంలోని జాతీయ రహదారి పక్కలో 11 కోట్ల రూపాయలతో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మించి వ్యాపారులకు కేటాయించిన ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ దుకాణాలను వెంటనే తెరిపించాలని బిఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ ఆధ్వర్యంలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు మంగళవారం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు నామరవికిరణ్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు నిర్వహించిన వేలంలో దుకాణాలను దక్కించుకుని రుసుమును చెల్లించి 20 నెలలు గడుస్తున్నా వ్యాపారులకు దుకాణాలు అప్పగించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి దుకాణాలను వ్యాపారులకు అప్పగించాలని, ఫలితంగా వ్యాపారులతో పాటు మున్సిపల్‌కు ఆదాయం సమకూరుతుందన్నారు. రానున్న దీపావళి పర్వదినం నుంచి దుకాణాల్లో వ్యాపారాలు చేసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందుకున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులతో సమావేశం అయి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి చేశారని నామ రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శివప్ప, నరేష్‌రెడ్డి, సందీప్, వ్యాపారులు గొల్ల సుభాష్, మహిపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుకాణాలు తెరిపించాలని అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న బిఆర్ఎస్ నేతలు, వ్యాపారులు

# కళాశాలకు భారీ మొత్తంలో విరాళాలు అందించిన దాతలు

**ఎమ్మెల్సీ కోదండరాం రాకతో ఉత్సాహం**
**ఎమ్మెల్యే శంకర్ పట్టుదలతో ప్రభుత్వ కళాశాలకు మహర్దశ**
**ఎమ్మెల్యే వీర్లపల్లి కృషికి సర్వత్రా ప్రశంసలు**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 22) :** షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విషయంలో అదే జరిగింది. విరాళాల సేకరణ ద్వారా భవన నిర్మాణంచేపట్టాలనుకున్న షాద్‌నగర్‌ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌సంకల్పం ఫలించింది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న విద్యార్థుల కల నిజం కానుంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమిపూజ విజయవంతం కావడంతో ఎమ్మెల్యే శంకర్ పనితీరుపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. మరోవైపుదాతలు ముందుకు వచ్చి విరాళాలు లక్షల్లో అందిస్తున్నారు. ఒకసారి ఈ కళాశాల భవన నిర్మాణ కథలోకి వెళితే..

**ఇదీ చరిత్ర**

షాద్‌నగర్‌పట్టణంలో 1969లో ప్రభత్వ జూనియర్ కళాశాల నిర్మాణం జరిగింది. అప్పటిపెద్దలు ఎన్.కె. రంగారావు, నాగిళ్ల గోపాల్‌గుప్త తదితరులు పట్టణానికి కళాశాల కావాలన్న సంకల్పంతో ముందడుగు వేసి ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావు ద్వారా కళాశాలను సాధించారు. అప్పటి వెంకటేశ్వరస్వామి ఆలయ ఉన్న ఈ భూమిని కళాశాల నిర్మాణం కోసం కేటాయించారు. ప్రస్తుత ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించారు.

**మరోమారు.. విరాళాల జోరు**

శంకుస్థాపనకార్యక్రమ సభలో ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పిలుపుతో పలువురు వ్యాపారస్థులు, పూర్వవిద్యార్థులు, నాయకులు ముందుకు వచ్చి లక్షలాది రూపాయలను అందజేశారు. పెంజర్ల గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి ఏకంగా 25లక్షల రూపాయలను సభలో ప్రకటించారు. అదేవిధంగా సోమిరెడ్డి నరేందర్ రెడ్డి ఆరు లక్షల చెక్కును అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి ఐదు లక్షలు, మాజీ జడ్పీటీసీ శ్యాం సుందర్ రెడ్డి ఐదు లక లు, సీనియర్‌నేత తాండ్ర కాశీనాథ్ రెడ్డి ఐదు లక్షలు, దండు బ్రదర్స్ శరత్ చంద్ర బాబు, వాసు తమ తండ్రి జ్ఞాపకార్థం ఐదు లక్షలు, అదేవిధంగా గోరి బ్రదర్స్ నవాజ్ గోరి, ఖాదర్‌గోరి ఒక లక్ష ఎనమిది వేల నగదు సభలో అందజేయడం విశేషం. అదేవిధంగా ఎమ్మెల్యే శంకర్ అనుచరుడు రాయికల్ శ్రీని వాస్ ఒక లక్షరూపాయలు, ప్రభుత్వ వ్యాపారవేత్త పలబట్ల పాండు రంగయ్య కళాశాలకు ఆర్‌వో వాటర్ ప్లాంటును అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇక కళాశాల నిర్మాణంలో కంకర మొత్తం సరఫరా చేస్తానని మైనార్టీ నాయకుడు సంగెం ఇబ్రహీం ప్రకటించారు. మొత్తం ఎనమిది నుండి పది కోట్ల అంచనాలతో కళాశాలను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే శంకర్ ప్రకటించడం విశేషం.



జూనియర్ కళాశాల శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం

# మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యాట గీతనర్సింహ్మా ఖరారు?

**-నాలుగు మండలాల నుండి 12 మందితో జాబితా తయారు**
**-కసరత్తు పూర్తి చేసిన ఎమ్మెల్యే, ఆమోదం కొరకు మంత్రి ముందుకు**



వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఇన్‌సెట్‌లో యాట గీత నర్సింహ్మా

**ఆమనగల్లు, అక్టోబర్22, ప్రభాతవార్త:** ఆమనగల్లు మార్కెట్ కమిటీ పాలకవర్గం తుది జాబితా దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తుంది. చైర్మన్ పదవి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా సతీమణి యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డిల పేర్లను ఖరారు చేసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వ్యవసాయశాఖ మంత్రికి పంపించగా, ఆశాఖ కూడా ఆమోదం పొందినట్లు తెలుస్తుంది. అక్కడి నుండి తెలంగాణ మార్కెటింగ్‌శాఖకు ఫైలు చేరగా, మార్కెటింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల పూర్తి వివరాల సేకరణ మొదలు పెట్టినట్లు తెలుస్తుంది. సభ్యులను ఒక్కకొక్కరిగా రప్పించుకుని వారియొక్క వ్యవసాయ భూమి వివరాలు, ఆధార్‌కార్డు వంటి పలు పత్రాలను తెప్పించుకుంటునే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిసింది. దీపావళి పండుగ తరువాత అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు కనిపిస్తుంది. కాగా ఆమనగల్లు వ్యవసాయమార్కెట్ కమిటీలో చైర్మ న్, వైస్ చైర్మన్‌తోపాటు 10 మంది పేర్లను సభ్యులుగా చేర్చారు. ఈమేరకు ఆమనగల్లు మండలం నుండి ఇద్దరు. కడ్తాల మండలం నుండి ఒకరు, తల కొండ పల్లి మండలం నుండి ముగ్గురు, మాడ్గుల మండలం నుండి నలుగు రికి కమిటీలో చోటు కల్పించినట్లు తెలుస్తుంది. కడ్తాల మండలానికి చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు మరొకరికి సభ్యునిగా అవకాశం కల్పించారు.

విశ్వసనీయ వర్గా ల సమాచారం మేరకు ఖరారైన జాబితా ఇలా ఉంది. చైర్మన్‌గా యాటగీత నర్సింహ్మా (కడ్తాల), వైస్ చైర్మన్‌గా గూడూరు భాస్కర్‌రెడ్డి (కడ్తాల), సభ్యులుగా వి.నరేశ్‌నాయక్ (కడ్తాల), తాళ్ళ రవిందర్(ఆమనగల్లు)వస్పులశ్రీశైలం (ఆమనగల్లు) ఎండీ అజీమ్(తలకొండపల్లి) వెంకట్‌రెడ్డి (తలకొండపల్లి) వడ్డేపల్లి అంజయ్య (తలకొండపల్లి) ఉడుతల యాదయ్య(మాడ్గుల), సంపత్ (మాడ్గుల) పల్లె జంగయ్యగౌడ్ (మాడ్గుల) జెలా రమేశ్‌గౌడ్(మాడ్గుల)తో పాలకవర్గం జాబితాను తయారుచేసినట్లు తెలుస్తుంది. మంత్రి ఆమోదంతో అందిన జాబితాలోని సభ్యులపై తెలంగాణ మార్కెటింగ్‌శాఖ అర్హతపై వివరాల సేకరణ కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తుంది.

# సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోండి

**-చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త**

**ఆమనగల్లు, అక్టోబరు22, ప్రభాతవార్త:** రైతన్నల అభివృద్ధి కోసం పీఏసీఎస్‌లు అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త అన్నారు. పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, ధాన్యం మద్దతు ధరలు వంటి వాటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం సింగిల్ విండోకార్యాలయంలో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త అధ్యక్షతన పాలకవర్గం సభ్యులతో సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. వచ్చేనవంబర్ మొదటివారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చైర్మన్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రూ. 2330 మద్దతు ధర, సన్నరకం వరి ధాన్యంకు రూ.500 బోనస్ ఉంటుందని ఆయన వివరించారు. ఉమ్మడి పీఏసీఎస్ పరిధిలోని కడ్తాల, ఆమనగల్లు మండల కేంద్రాల్లో వేరువేరుగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా పీఏసీఎస్ ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలు, ట్రాక్టర్, జేసీబీ, వ్యవసాయాభివృద్ధి సంబంధించిన దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు గంప వెంకటేశ్ వివరించారు. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఏదైన అనుమానాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మాడుగుల సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, ఆమనగల్లు వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టరు జోగు వీరయ్య, బెల్లి వెంకటయ్య, డీసీసీబీ మేనేజర్ గోపాల్, సీఈఓ దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, అల్లాజీ ఉన్నారు.



పీఏసీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్‌గంప వెంకటేశ్‌గుప్త

## అహ్మద్‌గూడలో స్మశాన వాటిక స్థలం కబ్జా

**కీసర, అక్టోబరు22, ప్రభాతవార్త:** దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ గ్రామంలో స్మశాన వాటిక స్దలం కబ్జా జరిగిందని మున్సిపల్ కౌన్సిలర్లు కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్, నానునాయక్‌లు మంగళవారం తహశీల్దార్ అశోక్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 1,2,88లో సుమారు 14 గుంటల స్మశాన వాటిక స్దలాన్ని మోడీ కన్‌స్ట్రక్షన్ యజమానులు కబ్జా చేశారన్నారు. మోడీ కన్‌స్ట్రక్షన్ ప్రక్కనే ఉన్న స్మశాన వాటిక స్దలాన్ని కబ్జా చేసి ముఖద్వారం నిర్మించారన్నారు..ఇప్పుడు మరల అక్రమంగా ప్రవేశం చేసి ఇంకొక ముఖద్వారం నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో మొదటి ద్వారం నిర్మాణం చేపట్టినప్పుడు అప్పటి తహశీల్దార్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షించి అధికారులు అట్టి అక్రమ ముఖద్వారాన్ని కూల్చివేయడం జరిగిందన్నారు. కానీ ఆ ముఖ ద్వారాన్ని మరల నిర్మించారన్నారు. పర్యవేక్షణ లేక పోవడంతో ఇంకొక ముఖ ద్వారాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్మశాన వాటిక స్దలం కబ్జాకు గురి కాకుండా కాపాడాలని తహశీల్దార్‌ని కోరారు.

## ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ బోధనను ఆచరణలో పెట్టాలి



పాఠశాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ చైర్మేన్ ఆకునూరిమురళి

**కొడంగల్, ప్రతిభావార్త, అక్టోబరు 22 :** తెలంగాణా రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ భోధనను ఆచరణలో పెట్టాలని రాష్ట్రవిద్యాశాఖ చైర్మేన్ ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం ఆయన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. ఇంగ్లీష్ భోదనకు సంభందించి సంభందిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికలు, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, జీసీపీఎస్ పాఠశాలతో పాటు బాలుర, బాలికల వసతి గృహాలను విద్యాశాఖ సభ్యులు పీఎస్ విశ్వేశ్వర్‌రావు, సీహెచ్ వెంకటేష్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ భోధనను ఆచరణలో పెట్టే విధంగా చర్యలు చేపట్టాలని సంభందిత అధికారులకు ఆదేశించారు. అనంతరం పట్టణంలోని కడా కార్యలయంలో కలెక్టర్ సమక్షంలో విద్యా వ్యవస్థలో పూర్వ ప్రాధమిక, ఉన్నత విద్యపై విద్యాశాఖ అధికారులతో చర్చించారు. అలాగే పాఠశాలల అభివృద్ధిపై మాట్లాడారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, కడా అధికారి వెంకట్‌రెడ్డి, సంభందిత అధికారులు, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

## అన్నోజిగూడ రోడ్డు అభివృద్ధి పనులు పరిశీలించిన చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్టీపీసీ బీటీ రోడ్డు పనులను చైర్మన్ బి. కొండల్ రెడ్డిమంగళవారం పరిశీలించారు. దాదాపు 30 లక్షల నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్డుపనులను చైర్మన్ పరిశీలించారు. కాలనీలు కొత్తగా ఏర్పాటు కావడం వాహ నాల సంఖ్య అంతకంతకు పెరుగు తుండటంతో రోడ్డు వెడల్పుతో పాటు రోడ్డు ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు స్థానిక నాయకులు కొమ్మల ప్రశాంత్, వినోద్ రెడ్డి, అక్షయ్, సుబాశ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

## ప్రాంతాల మధ్య విద్వేషాలు వద్దు

**పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కనినరసింహులు**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 22) :** ప్రాంతాల మధ్య విభేదాలు, వైషమ్యాలు సృష్టించడం మంచిది కాదని, తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని వివాదంలోకి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుథ్‌రెడ్డి లాగడం సమంజసంకాదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. మంగళవారం సీఎంరేవంత్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు లేఖను పంపించారు. ఈ సందర్భంగా దాని ప్రతిని స్థానిక మీడియాకు విడు దల చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి దర్శనం, వస తుల విషయంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలఅంశంలో జడ్చర్లఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి మాట్లాడిన తీరు ఆక్షేపణీయమని పేర్కొన్నారు. టీటీడీ స్వయం ప్రతిపత్తి గల సంస్థ అని, పరిపాలనఅంశాలను టీటీ డీబోర్డు చూసుకుంటుందని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై రెండు కళ్ల సిద్ధాంతం పై మాట్లాడడం సబబు కాద న్నారు. అనిరుథ్ రెడ్డి స్థాయికి మించి చంద్ర బాబుపై మాట్లాడడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఆయనకు హితవు పలకాలని లేఖ ద్వారా కోరారు. తెలంగాణలో ఆంధ్ర వ్యాపారాలు, ఇతర విషయాల అంశంలో ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి ధోరణి హెచ్చరిక భయపెట్టే విధంగా ఉన్నాయని, వీటి వల్ల ప్రాంతాల మధ్య వైశ మ్యాలు ఏర్పడతాయన్నారు. ఘర్షణకు తావులేకుండా ఇరు ప్రాంతాల ప్రజల మనో భావాలు దెబ్బ తినకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని లేఖలో సూచించారు. తాను కూడా టీటీడీ బోర్డు సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉందని, అదేవిధంగా ప్రస్తుత ఎమ్మె ల్యే అనిరుథ్ రెడ్డి గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలుగుదేశం సాంకేతిక విభాగంలో పనిచేశారన్న విషయాన్ని మర్చిపోకూడదని బక్కని హితవు పలికారు.

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డికి సన్మానం

**కౌడిపల్లి, అక్టోబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలపై ప్రతిపక్ష పార్టీలు చేసే తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టి ప్రజలకు అర్థమయ్యే విధంగా ప్రచారం నిర్వహించే సోషల్ మీడియా పార్టీకి పట్టుకొమ్మలాంటిదని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టిపిసిసి సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ కోలని మల్లేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్‌ను నూతనంగా నియమితులైన చిలుముల సుహాసిని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలుకప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలకు అవగహన కల్గించే విధంగా విస్తృతంగా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని ఆమే తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండలాలకు చెందిన సోషల్ మీడియా కోఆర్డినేటర్లు కౌడిపల్లి రామాంజనేయులు, నర్సాపూర్ చక్రవర్తి, శివంపేట రాజు, హత్నూర శ్రీశైలం, చిలిపిచెడ్ రెడ్డి రాథోడు, రాజు, నర్సింలు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన సిపి

**కీసర, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీర్యాల గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్ 1 పరీక్షా కేంద్రాన్ని మంగళవారం రాచకొండ కమీషనర్ సుదీర్‌బాబు పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ కమీషనర్ సుదీర్‌బాబు సిఐ వెంకటయ్యను అభినందించారు. పరీక్షా కేంద్రం వద్ద 144సెక్షన్‌అమలు చేశారు. రెండవ రోజు పేపర్‌కి 936 మంది అభ్యర్థులకు 488 మంది హజరు కాగా 448 మంది గైర్హాజరు అయ్యారు.

## గంగా జలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కీసర, అక్టోబరు 22, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ గంగా జలాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బిజెపి యువమోర్చ ఉపాధ్యక్షులు నల్ల వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారంకీసరలోని తపాలా కార్యాలయంలో సుమారు 2వేల కిలో మీటర్ల దూరంలో ఉన్న గంగా నది జన్మస్దలం అయిన గంగోత్రి నుండి సేకరించిన గంగా జలం బాటిల్స్‌ను స్వచ్ఛదంగా ప్రతి ఒక్కరికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ గంగా జలాన్ని పూజా, అభిషేకంకొరకు ఉపయోగించుకోవాలని సూచించారు.

## షాద్‌నగర్ గౌడన్నల ఆత్మీయ సమ్మేళనం

**ఘాన్సి మియాగూడ రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (అక్టోబరు 22) :** షాద్‌నగర్ నియోజకవర్గ గౌడన్నలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఘాన్సిమియాగూడ రేణుకఎల్లమ్మకు గౌడన్నలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారిఆశీస్సులు అందరిపై ఉండాలని, అందరు సుఖ సంతోషాలతో వెలుగొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలేపల్లి శ్రీనివాస్ గౌడ్, గుండుమల్ల శ్రీనివాస్ గౌడ్, పోలేపల్లి మల్లేష్ గౌడ్, పరిగి శేఖర్ గౌడ్, నీల రవీందర్ గౌడ్, జి.శ్రీశైలం గౌడ్, కొమ్మగంటి జగన్ గౌడ్, లంకాల రామన్ గౌడ్, నాని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వంద శాతం బ్యాంకు లింకేజి పూర్తి చేయాలి

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబరు 22,(ప్రభాతవార్త):** బ్యాంకులలో రుణాలు తీసుకున్న మహిళసంఘాల సభ్యులు వంద శాతం రుణాలు చెల్లించాలని ఏపిఎం నర్సింహా అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీఓఏలు గ్రామం లోని మహిళసంఘం సభ్యుల వద్ద నుంచి బ్యాంకులకు రావాల్సిన అప్పు డబ్బులను సకాలంలో చెల్లించే విదంగ చూడాలని అన్నారు. లక్‌పతి దిది, లోకోయాప్, మహిళ శక్తి, సెర్ప్ అన్ని కార్యక్రమాలు నెల చివరి వరకు పూర్తి చేయాలని అన్నారు. ఆయా గ్రామాలకు ఇచ్చిన టార్గెట్‌లను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ సంఘం అధ్యక్షురాలు మంజుల, సిసిలు రమేష్, దేవయ్య, స్వర్ణలతు ఉన్నారు.

## ప్రతినిధులు ప్రతిభచాటిన విద్యార్థికి సన్మానం

**ఆమనగల్లు, అక్టోబరు 22, ప్రభాత వార్త:** నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ చాటి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి స్థానిక నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్య ంలో ఘన సన్మానం లభించింది. పట్టణానికి చెందిన వీరమల్ల ఊర్మిళ రాధాకృష్ణమూర్తి దంపతుల చిన్న కుమారుడు వీరమల్ల సాయినాథ్ నీట్ పరీక్షలో 579 (జాతీయ స్థాయిలో 101566, రాష్ట్రస్థాయి 1345 ర్యాంకు) మార్కులు సాధించి ప్రతిభ చాటారు. దీంతో వరంగల్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ కేటగిరిలో సీటు సాధించారు. దీంతో ఆమనగల్లు నాయిబ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కానుగుల దశరథం, మండల గౌరవ అధ్యక్షులు పెరికేటి యాదయ్య, మండల అధ్యక్షుడు కానుగుల గణేశ్, పట్టణ అధ్యక్షుడు దేవరకొండ రమేశ్, జంపుల యాదగిరి, గుద్దేటి బాలు, జాజాల రాంచంద్రయ్య, కానుగుల రాజు, జంపుల సురేశ్, జాజాల అడివయ్య పాల్గొన్నారు.

## ఊరుపేరు మార్చాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి

**దోమ, అక్టోబరు 22 ప్రభాతవార్త:** మండలంలోని దొంగయెన్కెపల్లి గ్రామాన్ని సంజీవనగర్‌గా పేరు మార్చాలని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు శేరిరాంరెడ్డి, గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై గ్రామస్తులతో కలిసి వికారాబాద్‌జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని గత కొంత కాలంగా సంజీవనగర్‌గా మార్చాలని విన్నవించినఅధికారికంగా ఇంతవరకు పేరు మార్చలేదని తెలిపారు. గతంలో గ్రామానికి అధికారులు వచ్చి గ్రామ పూర్వపరాలు తెలుసుకోని వెళ్ళారని అన్నారు. గ్రామములో పురాతనంగా ఉన్న సంజీవఆంజనేయస్వామి దేవాలయము ఉన్నదని ఈ దేవాలయమునకు దేవాలయ భూములు కూడాఉన్నాయని తెలిపారు. దేవాలయమునకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున వచ్చి దైవ దర్శనం చేసుకుంటారని అన్నారు. దొంగయెన్కెపల్లి గ్రామాన్ని సంజీవ ఆంజనేయస్వామి పేరుతో సంజీవనగర్‌గా పేరు మార్చితే చాలా బాగుంటుందని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులుచేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి లెటర్ ప్యాడ్‌తో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

## రైతు నేస్తం పథకం ద్వారా రైతులకు రుణాలు

**తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేందర్**

**కోట్‌పల్లి, అక్టోబరు 22 ప్రభాతవార్త;** రైతులకు వ్యవసాయ భూమిపై రైతు నేస్తం పథకం ద్వారా రూ, 15 లక్షలు రుణం ఇవ్వడం జరుగుతుందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేందర్ అన్నారు. మంగళవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో రైతులకు రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ గ్రామీణ బ్యాంకుఖాతా దారులకు అధునిక సమాజంలో మానవ మనుగడ వేగంగా ప్రయాణిస్తున్న నేపథ్యంలో అనుకోకుండా జరుగుతున్న ప్రమాదాల నుండి కాపాడుకోవడానికి ప్రమాద భీమా తప్పనిసరిగా చేసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు బ్యాంకులో బంగారు అభరణాలపై సత్వర రుణ సదుపాయాలు ఉన్నాయన్నారు బ్యాంకులో బంగారు అభరణలపై రుణం తీసుకుంటే 88,పైసలు వడ్డి మరియు బ్యాంకు భద్రత, సులభమైన పద్ధతిలో తిరిగి రుణం చెల్లింపు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా గృహరుణం సిబిల్‌స్కోర్ ఆధారంగా అతి తక్కువ వడ్డీతో 8.50లతో రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు పశువులు పెంపకం పాడి, అదే విధంగా పౌల్ట్రీ, లకు అన్ని రకాల వ్యవసాయ రుణాలు ఇస్తున్నామన్నారు. కేంద్ర పభుత్వ అటల్ పెన్షన్ యోజన పెన్షన్ పథకం సంవత్సరానికి రూ,1456,లతో రూ,22 లక్షల ప్రమాద భీమా, రూ,2లక్షల జీవితభీమా ఉన్నాదన్నారు. ప్రధానమంత్రి ఇన్సు రెన్స్ స్కీమ్‌లు పీఎంఎస్‌బివై, పీఎంజెజెబివై ఉన్నాదని రైతులు స్వదినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు హబ్ మేనేజర్ రవికుమార్, బ్యాంకు సిబ్బంది వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు సురేష్, కారబార్ అశోక్, పాల్గొన్నారు,

Main-IV(MDK)-oct 22:Main-IV(MDK)-oct 22.qxd 10/22/2024 8:11 AM Page 1



## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** అనారోగ్యంతో అవస్థలు పడుతూ ఉన్నవారికి ప్రయివేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుకునేందుకు మండలంలోని గ్రామాలకు చెందిన 8 మందికి 1లక్ష 76వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంగళవారం అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలంలోని హోతి(బి) గ్రామానికిచెందిన దివ్యకు 39వేలు, ప్రియాంక పాండయ్యకు 18వేలు, షేఖాపూర్‌కు చెందిన షేఖ్ ఆహ్మద్‌కు 18వేలు, ఖాసింపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్‌కు 11వేలు, బూచినెల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్‌కు 20వేల 5వందలు, ఆనెగుంట గ్రామానికిచెందిన బోయిని వైష్ణవికి 15వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు అమిత్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, సోషల్ మీడియా ఇంచార్జి విజయ్ రాథోడ్, బుర్దిపాడ్, హోతి)బి), బూచినెల్లి గ్రామాల పార్టీ అధ్యక్షులు పెంటారెడ్డి, పర్వేజ్, గోవిందరెడ్డి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు చిన్నరెడ్డి పటేల్, శంకర్, మహబూబ్ ఖాన్, కిష్టయ్య, శ్రీనివాస్, రాజు, గౌసుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య కళాశాలలో టాస్క్ శిక్షణ శిబిరం




విద్యార్థులకు టాస్క్ స్కిల్‌పై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు ప్రవీణ్

**జహీరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో మంగళవారం టాస్క్ శిక్షణ శిబిరాన్ని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన శిబిరంలో శిక్షకులు ప్రవీణ్ విద్యార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో వివిధ మల్టినేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించాలంటే ఇంటర్వ్యూ స్కిల్స్ ఎంతో ముఖ్యమని గుర్తుచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నిర్వహించినటువంటి మాక్ ఇంటర్వ్యూలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌లు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల టాస్క్ కో-ఆర్డినేటర్ నర్సింలు, అధ్యాపకులు నికిత, దీపిక, నందుగౌడ్, రమేష్, నవీన, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి నేరస్తులకు కౌన్సిలింగ్



గంజాయి నేరస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ

**సిర్గాపూర్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పాత గంజాయి నేరస్థులకు మంగళవారం సిఐ, ఎస్ఐలు కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేక, ప్రభుత్వం నిషేదించిన వ్యాపారాలు, రవాణా చేయకుండా సజ్జనులుగా పనులు చేసుకుంటూ జీవించాలని సూచించారు. మరో మారు నేరానికి పాల్పడితే పిడి యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయని, నేరాలకు పాల్పడి జైలు పాలై తమ కుటుంబ సభ్యులు రోడ్డు పాలుకాకుండా మంచిగా బతకాలని సూచించారు.

## విద్యార్థులకు బ్యాగులు నోట్‌బుక్స్‌లు అందజేత

**శివ్వంపేట, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** మండలంలోని రత్నాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, స్కూల్‌బ్యాగులు, పెన్నులు, పలకలు అక్షయ్య ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అరికెల వెంకటేశం మాట్లాడుతూ అక్షయ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు బ్యాగులు నోట్‌బుక్స్‌లు అందజేయడం ఎంతో గొప్ప విషయమని రాబోయే రోజులలో ఎంతోమంది విద్యార్థులకు సహాయసహకారాలు అందించాలని విద్యార్థులకు బ్యాగులు, బుక్స్ అందజేసిన ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత జ్యోతి, సంధ్యారాణి, గౌసుద్దిన్, రాజు, అక్షయ్య ఫౌండేషన్ సభ్యులు సురేశ్ యాదవ్, మహేష్, సాయి, భాను, పవన్, మింటు, రోషిత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారం చేసుకుంటే కక్షతో తొలగించడం సరైనది కాదు

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** మెదక్ పట్టణానికి చెందిన కొందరు చిన్న వ్యాపారస్థులు డబ్బాలలో తమవృత్తికి సంబంధించిన వ్యాపారం చేసుకుంటే డబ్బాలను కక్షకట్టి తొలగించడంతో మున్సిపల్ అధికారుల కక్షపూరిత చర్యలు సరైన విధానం కాదని మెదక్ పట్టణ 5వ వార్డు కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు మామిళ్ల ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ బలంతో డబ్బాలు వేసుకొని కిరాయిలకు ఇచ్చుకునే వారి డబ్బాలు తొలగించాలన్నారు. ఇంద్ర కాలనీకి చెందిన కుమ్మరి లక్ష్మణ్ డబ్బాలో గత 15 సంవత్సరాలుగా మట్టి కుండలు, మట్టి పాత్రల వ్యాపారం చేసుకుంటూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నారని, సీఎస్ఐ కాంప్లెక్స్ మూలంగా కొంతమంది డబ్బాలను తొలగించడంతో వాప్యారం నిమిత్తం ఫతేనగర్‌లోని మున్సిపల్ స్థలంలో డబ్బా వేసుకుంటే జేసీబీ ద్వారా తొలగించి మున్సిపల్ అధికారులు అక్రమంగా, దుర్మార్గంగా చిన్న వ్యాపారంపై ఉక్కుపాదం మోపడం సరైన విధానం కాదన్నారు. డబ్బులుపెట్టి కిరాయి తీసుకునే కొంతమంది బీనామీల డబ్బాలను కూడా తొలగించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులకు నిజాయితీ ఉంటే డబ్బాలు నిర్మాణం చేసి కిరాయికి ఇచ్చి పేదల పొట్టకొడుతున్న రాజకీయ పలుకుబడి ఉన్న నాయకుల డబ్బాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఎంపిని కలిసిన ఎస్సీ మోర్చా నాయకులు



హైద్రాబాద్‌లో ఎంపి రఘునందన్‌రావును కలిసిన ఎస్సీ మోర్చా నాయకులు

**నర్సాపూర్ అక్టోబర్ 22. ప్రభాతవార్త:** మెదక్ ఎంపి రఘునందన్‌రావును ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు బబ్బూరి కృష్ణతో పాటు నర్సాపూర్ ఎస్సీ మోర్చా నాయకులు మంగళవారం హైద్రాబాద్‌లోని రాజ్‌భవన్‌కు వెళ్లి ఎంపి రఘునందన్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలూవా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా నాయకులు మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో ఎంపి భవనం ఏర్పాటు చేయాలని వారు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు జలేందర్, అశోక్, సాయిలు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో గతుకుల రోడ్లకు మహర్దశ



గుంతలమయంగా మారిన పుణ్యాల పన్యాల రోడ్డు దృశ్యం

**పుల్‌కల్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** రోడ్లపై ప్రయాణానికి పాట్లుపడుతూ వచ్చిన ప్రయాణికులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. గుంతలమయం, కంకరతేలిన రోడ్లకు మరమ్మతులు చేయించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరుచేసింది. గత శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత ఆరోగ్యశాఖమంత్రి సి.దామోదర రాజనర్సింహా తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలోని రోడ్లకు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఎన్నికల్లో ప్రజలు దామోదర్ రాజనర్సింహాకు అవకాశం కల్పించడం, కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పదవి కట్టబెట్టడంతో నియోజకవర్గ ప్రజలు పడ్డ ఆనందం అంతా ఇంతా కాదు. ఎన్నికల సందర్భంగా చేసిన హామీమేరకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని రోడ్ల మరమ్మతులకు 34.32 కిలో మీటర్ల మేర రోడ్ల మరమ్మతులకు 25.08 కోట్ల రూపాయలను మంజూరు చేయించటంలో రాజనర్సింహా సఫలీకృతులయ్యారు. పుల్కల్ మండలంలోని గొంగ్లూర్‌లో 1.40 కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులకు 98 లక్షలు, కొండారెడ్డిపల్లి చౌరస్తా నుంచి కొడూర్-బొమ్మారెడ్డిగూడెం 6.70 కిలోమీటర్ల రోడ్లకు 4.69 కోట్లు, చౌటకూరు-కొన్యాల చౌరస్తారోడ్డు 3 కిలోమీటర్లకు 2.10 కోట్లు, రాయికోడ్-ధర్మాసాగర్ 2.47 కిలోమీటర్ల రోడ్డుకు 2.46 కోట్లు, అల్లాదుర్గం-పాంపాడ్-షాపూర్ 3.30 కిలోమీటర్ల రోడ్డుకు 2.63 కోట్లు, అందోలు మండలం డాకూర్ మీదుగా సంగుపేట మాసానిపల్లి వరకు 3.40 కిలోమీటర్ల రోడ్డుకు 2.38 కోట్లు, రోళ్లపాడ్ 2 కిలోమీటర్ల రోడ్డుకు 1.40 కోట్లు, దానంపల్లి 1.20 కిలోమీటర్ల రోడ్డుకు 84 లక్షలు, కిచ్చనపల్లి 1.50 కిలోమీటర్ల రోడ్డుకు 1.05 కోట్లు, మునిపల్లి మండలం కంకోల్-మేలసంగం 1.30 కిలోమీటర్ల రోడ్డుకు 90.65 కోట్లు, బెలూర్-చీలపల్లి 3.45 కిలో మీటర్ల రోడ్డుకు 2.41 కోట్లు, మునిపల్లి-చందాపూర్ 2.80 కిలోమీటర్ల రోడ్డుకు 1.96 కోట్లు, తక్కడపల్లి 1.80 కిలోమీటర్ల రోడ్డుకు 1.26 కోట్ల రూపాయలు దామోదర్ రాజనర్సింహా కృషితో మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో చిత్తడిగా మారిన రోడ్ల మరమ్మతులకు 25.08 కోట్ల రూపాయలను మంజూరు చేయించిన రాజనర్సింహాకు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మంజూరైన నిధులతో రోడ్లనిర్మాణం పనులు నాణ్యతగా పూర్తయ్యేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**నిధుల మంజూరుతో కాంగ్రెస్ నేతల హర్షం..**

ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహా నిధులు మంజూరు చేయించటం పట్ల మండల ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. చౌటకూరు మండలంలోని కొన్యాల పన్యాల రోడ్డుకు మహర్దశ రానుండటంతో కాంగ్రెస్ చౌటకూరు గ్రామ కమిటి అధ్యక్షులు వరకల రమేష్, నాయకులు రామా గోవర్ధన్ ముదిరాజ్ గౌడ్, కైసర్, రఘుపంతులు, శ్రీనివాస్ ముదిరాజ్, నవీన్ గౌడ్, నరేందర్‌రెడ్డి, ఆగమయ్యలు ఆనందం వ్యక్తంచేశారు.

## హిందూ సంఘాల ర్యాలీ..సిర్గాపూర్ బంద్




సిర్గాపూర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందు సంఘాల బాధ్యులు

**సిర్గాపూర్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** హిందూ దేవుళ్లపై దాడి చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా సంఘాల నాయకులు గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామం బంద్‌కు ముందస్తుగానే పిలుపు ఇవ్వడంతో గ్రామంలోని వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ జరుపుకొని బంద్‌కు తమవంతుగా సహకరించారు. హిందువుల ఆత్మాభిమానమైన దేవి దేవతల విగ్రహాలను ధ్వంసంచేయడం హిందూసంస్కృతిని నాశనం చేయాలన్న దుర్మార్గపు చర్యలు ఇక మానుకోవాలని దుండగులకు హెచ్చరించారు. హిందూ దేవతలపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

## ఈజీఎస్ పనులపై అవగాహన గ్రామసభ

**నిజాంపేట (ఖేడ్), అక్టోబరు 22 ప్రభాతవార్త:** నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ మాట్లాడుతూ ఈజీఎస్ పనులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేసి మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఈజీఎస్ పనులు చేస్తుంటారు, కాని ఈ సంవత్సరం చెరువులో కాకుండా రైతులకు అవసరం ఉన్నటువంటి మట్టిరోడ్డుగా వేసుకుంటే మీకు పొలాలకు వెళ్లడానికి సులువుగా ఉంటుందని అన్నారు. ఈ మట్టిరోడ్లు వేయాలంటే ఇరువైపులా రైతులు సహకరించాలని వారిని కోరారు. అలాగే గొర్రెలకు, పశువులకు షెడ్లు భూమి ఎత్తుపల్లాలు ఉంటే దానికి కూడా ఈజీఎస్ పనిలో పూర్తి చేసుకోవచ్చన్నారు. ప్లాంటు డ్రాగన్స్ తోటలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అఖిలాండేశ్వరి, టిఎ బన్సీలాల్, రూప్‌సింగ్, పాండు, సవాయిసింగ్, గోవింద్, చంద శ్రీను, గురునాథ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన



గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు తదితరులు

**నర్సాపూర్ అక్టోబర్ 22. ప్రభాతవార్త:** క్షేత్రసందర్శనలో బాగంగా నర్సాపూర్ మండలంలోని ఆవంచ గ్రామాన్ని ట్రైనీ ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు సందర్శించారు. ఈ మేరకు వివిధ రాష్ట్రాల ట్రైనీ ఆఫీసర్‌లు, ఐఆర్ఎస్ ఆఫీసర్ సోనూ, ఐపిఎస్ అరుణ్‌కుమార్ సింగ్, ఐఎఫ్ఓఎస్ బోస్లే అక్షయ్ దినకర్, ఐఎఫ్ఎస్ మనీషా కాన్సల్, ఐపిఎస్ కె.ఎం. ప్రియాంకలు ఆవంచను సందర్శించారు. ఆవంచలో గ్రామ పంచాయతీని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పల్లె ప్రకృతివనాన్ని, వైకుంఠధామాన్ని, నర్సరీలను, పాఠశాలను ఉన్నత పాఠశాలను వారు సందర్శించి ఈ పాంతశాలలోని మధ్యాహ్న బోజనాన్ని పరిశీలించారు. అంతేగాక క్రీడా మైదానం, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఏవిధంగా ఉన్నాయి, ఏవిధంగా అమలవుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

## బిల్లుల కోసం నల్లబ్యాడ్జ్‌లతో ఉపాధ్యాయుల నిరసన



పాపన్నపేటలో నల్లబ్యాడ్జ్‌లు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

**పాపన్నపేట, అక్టోబరు 22, ప్రభాతవార్త:** తమకు అందాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, డిఎలను, పిఆర్‌పిలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలల వద్ద నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన వ్యక్తంచేశారు. మండలంలోని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలమవుతున్నా, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ఇప్పటివరకు చెల్లించకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. 4 డిఎలు పెండింగ్‌లో ఉన్నా, ఒక్క డిఎకు కూడా ఇవ్వలేదని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను, 4 డిఎలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో తపస్ మండల శాఖాధ్యక్షులు మంగ నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, ప్రవీణ్, కృష్ణకాంత్, రమేష్, నింగప్ప, యాదయ్య, వేణు గోపాల్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటు హక్కును ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. డిగ్రీ ఒరిజినల్ మెమో లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని నింపి నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను పార్టీ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వారి యొక్క ఎమ్మెల్సీ ఓటు హక్కును ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, బొగుడాల కృష్ణ, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల ప్రజా సమస్యలను పరిష్కరించండి



ఎంపీ రఘునందన్‌రావును శాలువాతో సన్మానిస్తున్న ఈర్ల రాజు

**అమీన్‌పూర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావును అమీన్‌పూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు బృందం కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీల సమస్యలను ఎంపీకి వివరించడం జరిగిందని, దానికి సానుకూలంగా స్పందించి త్వరలోనే కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలలో పర్యటించి సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని ఈర్ల రాజు తెలిపారు.

## నాణ్యత ప్రమాణాలతో ప్రభుత్వ మద్దతు ధర పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

**గుమ్మడిదల, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కానుకుంట గ్రామంలోని రైతువేదికలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై రైతులకు, అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చేటప్పుడు రైతులు ప్రభుత్వం సూచించిన నాణ్యతాప్రమాణాలను పాటించాలన్నారు. మండలంలో సుమారు 6,900 ఎకరాల్లో వరి సాగు అయ్యిందని, 80శాతం సన్నాలను సాగు చేశారన్నారు. ప్రభుత్వం రైతులకు దొడ్డువడ్లకు ఎ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2300 చెల్లించనుందని, సన్నరకాలకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు నాణ్యతాప్రమాణాలు పాటించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. అదేవిధంగా పంటకోసే సమయంలో తాలు తప్పలు లేకుండా ఫ్యాన్ స్పీడ్ 19 ఆర్ఎంపీ కంటే ఎక్కువ ఉండాలని హార్వెస్టర్ యజమానులకు సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో అనూష, ఏఈవో వి. ప్రణవి, ఐకేపీ ఏపీఎం శివకుమార్, ఐకేపీ సిబ్బంది, కానుకుంట, రాంరెడ్డి బావి, వీరారెడ్డిపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తారా కళాశాలలో కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి



తారా ప్రభుత్వ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాలలో కనీస సౌకర్యాల ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. మంగళవారం కళాశాలను ఎమ్మెల్యే సందర్శించి కళాశాల పరిసరాలను పరిశీలించి బాధ్యులతో సమావేశం అయ్యారు. కళాశాలలో బాలికలకు ప్రత్యేకంగా యూరినల్స్ ఏర్పాటు, కాంపౌండ్ వాల్‌కు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కామర్స్ బ్లాక్‌లో నీటికొరతను తీరుస్తానని పేర్కొన్నారు. సదాశివపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాగునీటివసతి కల్పనకు, బాలికలకు వసతిగృహం సదుపాయాన్ని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ రత్న ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో విజయేందర్‌రెడ్డి, వెంకటేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సైకిల్ ర్యాలీ




సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా పెద్దశంకరంపేటలో అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్‌ల ఆధ్వర్యంలో మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్, అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి, రేగోడ్, టేక్మాల్ ఎస్ఐలు, ఏఎస్ఐ సునీత, పోలీస్ సిబ్బంది శంకర్, అంజలి, సుధీర్, రాజు, రమేష్, మల్లేశం, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ పట్టణ పరిధిలోని ఔరంగాబాద్, అవుసులపల్లి, ఔరంగాబాద్ తండా, మెదక్ మండలం పాతూరు గ్రామాలలో అకాల వర్షానికి ఆరబెట్టిన ధాన్యం, తడిసిన ధాన్యం రాశులను సందర్శించి, పరిశీలించారు. తడిసిన, మొలకెత్తిన చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతప్రభుత్వంలో తడిసిన ప్రతి గింజను కొనుగోలుచేసి రైతన్నలను ఆదుకోవడం జరిగిందని గుర్తుచేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట సకాలంలో కొనుగోలుచేయక అకాల వర్షానికి అవస్థ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గెలవగానే రైతుల ఖాతాల్లో వేస్తానన్న రైతుబంధు వేయకపోగా, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతాంగాన్ని అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతన్నలను ఆదుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న వడ్లను తూకంవేసి వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని, వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని చూసి చలించిపోయి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో ఫోన్‌లో మాట్లాడి క్షేత్ర పర్యటన చేసి నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. స్థానిక తహశీల్దార్‌ను పంపించి వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా చూస్తామని కలెక్టర్ తెలిపారు. వీరి వెంట తాజా మాజీ జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ కౌన్సిలర్లు కిషోర్, విశ్వం, జయరాజు, మెదక్, హవేళిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎం. అంజాగౌడ్, సీహెచ్. శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ప్రభు రెడ్డి, కిష్టయ్య, బాలయ్య, మోహన్, శ్రీనివాస్, రంజిత్, ఔరంగాబాద్, అవసులపల్లి, పాతూర్ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీకోసం ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఎమ్మెల్యే ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న రఘునాథ్ వెరబెల్లి తదితరులు

**నర్సాపూర్ అక్టోబర్ 22. ప్రభాతవార్త:** అర్హులైన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని బిజెపి ఐటి బోర్డ్ అఫ్ గవర్నర్ రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కళాశాలలో, బివిఆర్ఐటి కళాశాలలో డాన్‌బాస్కో పాఠశాలలో తదితర కళాశాలలోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ఓటరుగా నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈమేరకు ఓటరుగా నమెదు చేసుకోదలిచిన వారు అధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, డిగ్రీ మెమో, ఓటరు ఐడి కార్డులు జతచేయాలన్నారు. అంతేగాక వాట్సప్ మొబైల్ నెంబర్ 9160603222 కు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, రఘువీరారెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, బివిఆర్ఐటి ఎఓ అశోక్‌రెడ్డి, ఎల్లంకి కళాశాలల కరస్పాండెంట్ అశోక్‌కుమార్, జిల్లా అ్యక్షులు గడ్డం శ్రీనవాస్,అసెంబ్లీ కన్వీనర్ హెచ్‌వి. రమణారావు, వాల్దాస్ మల్లేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.